**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 15.10.2024** **సమయం 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. జాతీయ సముద్ర భద్రతకు కేంద్రం కట్టుబడి ఉందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చెప్పారు. వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో విఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ కు ముఖ్యమంత్రితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.

2. రెండువేల మంది సిబ్బందితో తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన దళాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

3. నల్గొండ జిల్లాలో నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ వరకు 14 కిలోమీటర్ల పొడవున నాలుగు లేన్ల బైపాస్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం 516 కోట్ల రూపాయలు మంజూరు చేసింది.

4. గురుకులాలకు అద్దెలు చెల్లించడంలో ఆలస్యం అయినందుకు నిరసనగా పలు ప్రాంతాల్లో ఆయా గురుకులాలకు తాళాలు వేసిన వారిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.

వీఎల్ఎఫ్:

జాతీయ సముద్ర భద్రతకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి ఆయన ఈ రోజు వికారాబాద్ దామగుండం అటవీ ప్రాంతంలో భారత నౌకాదళానికి చెందిన అతి తక్కువ ఫ్రీక్వెన్సీ (VLF) రాడార్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణ మంత్రి ఈ VLF

స్టేషన్ వల్ల దేశ సైనిక సామర్థ్యం మరింత విస్తారం అవుతుందనీ, సైనిక దళాలకు సహాయకరం కానున్నదనీ అన్నారు. high-tech VLF స్టేషన్ పని చేయడం ప్రారంభించగానే ఒక సైనిక వ్యవస్థ మాత్రమే కాదు, జాతీయ ప్రాముఖ్యత కల ఒక వ్యూహాత్మకమైన వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని ఆయన అన్నారు. 2900 ఎకరాల విస్తీర్ణంలో 3200 కోట్ల రూపాయల ఖర్చుతో ఈ రాడార్ స్టేషన్ నిర్మిస్తున్నారు. రాడార్ స్టేషన్ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశరక్షణ రంగాన్ని అత్యాధునిక సాంకేతికతో ఆధునీకరించడం అవసరమని దేశ భద్రత విషయంలో వెనుతిరగమని మంత్రి అన్నారు. ఈ వీఎల్ ఎఫ్ ప్రాజెక్ట్ ద్వారా పర్యావరణంపై స్థానికులపై ఎటువంటి చెడు ప్రభావం ఉండదని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. దేశ రక్షణకు భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. వీఎల్ ఎఫ్ ప్రాజెక్టుపై పలువురు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ముఖ్యమంత్రి అన్నారు. అంతకుముందు భారత నౌకాదళానికి, దేశాభివృద్ధిలో ఈ ప్రాజెక్టు వ్యూహాత్మక ప్రాముఖ్యతను చీఫ్ ఆఫ్ ద నావెల్ స్టాఫ్ అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి ప్రముఖంగా ప్రస్తావించారు. (MSM)

తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్

సుమారు 2000 మంది సిబ్బందితో కూడిన తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన దళం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రబుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సచివాలయంలో ఈ రోజు డీజీపీ Dr జితేందర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదనల పై చర్చించారు. వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండేందుకు సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచి మొదటి బ్యాచ్ సిబ్బందిక శిక్షణ

ప్రారంభించాలని ఆమె ఆదేశించారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగిన ఘటనల నేపథ్యంలో అగ్నిమాపక శాఖకు చెందిన 10 బృందాలు, తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లోని 10 కంపెనీలను వినియోగించి తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.అవసరమైన పరికరాలు, శిక్షణ అందించడం ద్వారా అగ్నిమాపక శాఖలోని 10 బృందాలను ఎస్‌డిఆర్‌ఎఫ్ స్టేషన్‌లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు డిజి ఫైర్ సర్వీసెస్ నాగి రెడ్డి తెలిపారు. pn

నల్గొండ:

జాతీయ రహదారి నెంబర్ 565లో నల్గొండ పట్టణం గుండా సాగే నకిరేకల్ - నాగార్జునసాగర్ మార్గంలో 14 కి.మీ. మేర 4 వరుసల బైపాస్ రోడ్డు పనులకు 516 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఈ జాతీయరహదారి రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత ప్రధానమైందని, తెలంగాణలోని నకిరేకల్ కూడలి నుంచి మొదలయ్యే ఈ జాతీయ రహదారి నల్గొండ, ఆంధ్రప్రదేశ్ లో మాచర్ల, ఎర్రగొండపాలెం, కనిగిరి మీదుగా సాగుతుందని వివరించారు. ప్రస్తుతం నల్గొండ నుంచి సాగే రహదారిలో భారీగా వాహనాల రద్దీ నెలకొంటోందనీ, తాజాగా మంజూరు చేసిన బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల నల్గొండ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు, నకిరేకల్ - నాగార్జునసాగర్ మధ్య అనుసంధానం మెరుగవుతుందని ఆయన అన్నారు. కేంద్రం ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయడంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. (పీటీసీ)

సీతక్క:

ఈ రోజు గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలతో ముఖాముఖీ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనేక ప్రజాసమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భూ వివాదాలు,

నూతన అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు, ఇందిరమ్మ సంఘాల్లో కాంగ్రెస్ కార్మికులకు అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగ పోస్టుల భర్తీ వంటి అనేక అంశాలపై పౌరులు మంత్రికి పిటిషన్లు అందజేశారు. అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. కాగా.. మంత్రి సీతక్క ఆయా జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఫోన్లో సంభాషించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. (డెస్క్)

అబ్దుల్ కలాం:

ఈరోజు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి జరుపుకుంటున్నారు 1931లో కలాం తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారు. భారత క్షిపణి పితామహుడిగా పేరుపొందిన డాక్టర్ అవుల్ పాకిర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లో విద్యాభ్యాసం చేసి మనదేశంలో తొలి దేశీయ ఉపగ్రహ వాహక నౌకను అభివృద్ధి చేయడంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వహించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ వాహక నౌక కార్యక్రమం పరిణామం చెందేందుకు, ముఖ్యంగా పిఎస్ఎల్వి రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. డాక్టర్ కలాంకు పద్మభూషణ్, పద్మ విభూషణ్, దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న లభించాయి. 2002 సంవత్సరంలో భారత్ పదకొండవ రాష్ట్రపతిగా ఆయన బాధ్యతలు చేపట్టారు అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని తన నివాసంతో ఆయనకు పుష్పాంజలి ఘటించారు డాక్టర్ అబ్దుల్ కలాం దేశ యువతకు స్ఫూర్తిని ఇచ్చారనీ, తమ కలలను సాకారం చేసుకునేందుకు దేశ ప్రగతికి కృషి చేసేందుకు వారికి ప్రేరణ కలిగించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. (డెస్క్)

LIC అంబులెన్స్

హైదరాబాద్ నగర శివారు లోని కొత్తూరు మండలంలోని కన్హ శాంతివనం ఆసుపత్రికి - లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - LIC - తమ సామాజిక బాధ్యతలో భాగంగా - ఒక అంబులెన్స్ వాహనాన్ని అందజేసింది.

LIC జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ - ఈరోజు - ఆ వాహనాన్ని - ఆసుపత్రి ఇంచార్జి - డాక్టర్ కిషోర్ కు అందజేశారు.

ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ, అత్యున్నత సేవలు అందిస్తున్న కన్హా శాంతి వనం ఆసుపత్రికి - LIC ఈ విధంగా తోడ్పడటం ఆనందంగా ఉందని తెలిపారు. (డెస్క్)

పీఎం టెలీకామ్:

కృత్రిమ మేధస్సును నైతికంగా విచక్షణ పూర్వకంగా వినియోగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సుకు సంబంధించిన అన్ని చర్చల్లోనూ భద్రత గౌరవ సమానత్వం అనేవి ప్రాతిపదికలుగా ఉండాలని ఆయన చెప్పారు. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ఒక భౌగోళిక వ్యవస్థను ఏర్పాటు చేయడం అవసరమని జి 20 అధ్యక్ష బాధ్యత వహించిన సమయంలో భారత్ అంశాన్ని ప్రస్తావించిందని ఆయన గుర్తు చేశారు. భౌగోళిక పాలన వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తించాలని, అంతర్జాతీయ సంస్థలను భారత్ కోరిందని ఆయన చెప్పారు. ఈరోజు న్యూఢిల్లీలో భారత మండపంలో అంతర్జాతీయ టెలి కమ్యూనికేషన్ యూనియన్ ప్రపంచ టెలి కమ్యూనికేషన్ ప్రమాణాల సదస్సులో ప్రధానమంత్రి మాట్లాడారు. ---NSD

రాజన్న సిరిసిల్ల:

గౌడ కార్మికుల ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షక కవచం కిట్ ఉపయోగపడుతున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఈ రోజు  నూతన గ్రంధాలయ భవనంలో నిర్వహించిన కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు.   (పీటీసీ)

గురుకులాస్:

గురుకులాలకు అద్దెలు చెల్లించడంలో ఆలస్యం అయినందుకు నిరసనగా పలు ప్రాంతాల్లో ఆయా గురుకులాలకు తాళాలు వేసిన వారిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ

శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా దసరా సెలవుల తర్వాత గురుకులాల కళాశాలలు తెరుచుకున్నప్పటికి కొన్ని ప్రాంతాలలో అద్దె బకాయిలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ.. బిల్డింగ్ యాజమానులు గురుకులాల భవనాల గేట్లను మూసివేశారు. (డెస్క్)

కిషన్ రెడ్డి:

వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో వెరీ లో ఫ్రీకెన్సీ రాడార్ స్టేషన్ నిర్మాణం తెలంగాణకు గర్వకారణమని కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తమిళనాడులో ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ తర్వాత దేశంలో ఏర్పాటు చేస్తున్న రెండవ రాడార్ స్టేషన్ దామగుండం రాడార్ స్టేషన్ అని అన్నారు. యుద్ధ సమయంలో రక్షణ రంగ ఓడలను జలాంతర్గాములను కమ్యూనికేట్ చేసేందుకు ఈ రాడార్ స్టేషన్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. జాతీయ రక్షణ పథకాలను వ్యతిరేకిస్తూ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. (డెస్క్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:

వ్యక్తిగతంగా కానీ వృత్తిపరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని జిల్లా పోలీసు సిబ్బందిని జిల్లా పోలీస్ సూపరెంటెండెంట్ రోహిత్ రాజ్ కోరారు. ఇటీవల కాలంలో జిల్లాలో పోలీసుల బలవన్మరణాలు పెరిగిన నేపథ్యంలో.. జిల్లా పోలీస్ అధికారులు సిబ్బందితో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఇకపై ప్రతి గురువారం పోలీసు అధికారులు, సిబ్బంది తమ సమస్యల పరిష్కారానికై నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. (పీటీసీ)

మంచిర్యాల:

మావోయిస్టుల లేఖ...

పౌర హక్కుల నేత, ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా ఆకస్మిక మృతిపై నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ సంతాపం వ్యక్తం చేసింది. సాయిబాబా నెలకొల్పిన ఆశయాలను, ఆదర్శాలను, కుటుంబ సభ్యులు, స్నేహితులు, తన వారసులుగా కొనసాగించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ కోరారు. (పీటీసీ)

నిర్మల్ జిల్లా:

నిర్మల్ జిల్లా గుండెగాప్ గ్రామం కు నిధులు విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ ముందు రేపు నిరసన చేయనున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచరపు భూమయ్య తెలిపారు. నిర్మల్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బైంసా మండలంలోని గుండెగాప్ గ్రామం గత పది సంవత్సరాల నుంచి ముంపునకు గురవుతుందని ఇప్పటివరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పూర్తి నిధులు విడుదల చేసి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. (పీటీసీ)

స్ట్రైక్:

కోల్కతాలో ఆర్ జి కర్ ఆసుపత్రిలో అత్యాచారం హత్యకి గురైన జూనియర్ డాక్టర్ పట్ల సంఘీభావంగా తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం సభ్యులు, భారత మెడికల్ అసోసియేషన్ తెలంగాణ విభాగం సభ్యులు ఈరోజు 12 గంటల నిరాహార దీక్ష పాటించారు. ఈ దీక్ష ఈ సాయంత్రం ముగిసింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యుల రక్షణ విషయంలో తక్షణమే నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డాక్టర్ల సంఘం కోరింది.